క్లుప్తంగా

నేటి నుంచి పూడమ్మతల్లి వారోత్సవాలు



పూడమ్మతల్లి వనుంగుడి

నెల్లిమర్ల: నెల్లిమర్ల గ్రామదేవత శ్రీ పూడమ్మతల్లి వారోత్సవాలు సోమవారం నుంచి రెండు రోజుల పాటు జరగనున్నాయి. నేటి మధ్యాహ్నం ఒంటి గంటకు స్థానిక వనుంగుడి దగ్గర నుంచి అమ్మవారిని మేళతాళాలతో ఊరేగింపుగా చదురుగుడి వద్దకు తీసుకువస్తారు. రాత్రి 8 గంటల వరకు అమ్మవారి ఘటాలు పట్టణంలోని అన్ని వీధుల్లో తిరుగుతాయి. రాత్రి 10 గంటలకు చదురుగుడి వద్ద చింతామణి నాటక ప్రదర్శన ఉంటుంది. మంగళవారం వేకువజామున 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించుకోవటానికి ఏర్పాట్లు చేసినట్టు ఆయల కమిటీ ప్రతినిధులు తెలిపారు. పట్టణవాసులు అమ్మవారిని దర్శించుకుని, కృపాకటాక్షం పొందాలని వారు సూచించారు.

భవిష్యత్‌పై దృష్టి సారించండి



మాట్లాడుతున్న బ్రహ్మకుమారీస్ జిల్లా ఇన్‌చార్జ్ బికె.అన్నపూర్ణ

విజయనగరం టౌన్: యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ తమ భవిష్యత్తుపై దృష్టి సారించి జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలని బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రాల జిల్లా ఇన్‌చార్జ్ బికె.అన్నపూర్ణ పేర్కొన్నారు. స్థానిక కంటోన్మెంట్ వద్దనున్న బ్రహ్మకుమారీస్ కేంద్రంలో యూత్ వింగ్ ఆధ్వర్యంలో నషా ముక్త్ యువ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్తమాన సమయంలో యువతకు మెడిటేషన్ సాధన ద్వారా యువతకు ఆధ్యాత్మిక, నైతిక విలువలు చాలా ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని సాధించేందుకు శక్తివంచన లేకుండా శ్రమ చేయాలన్నారు. మొబైల్, ఇంటర్‌నెట్, సామాజిక మాధ్యమాలకు బానిస కావద్దన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సరస్వతి, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.రాజకుమార్, జిల్లా యూత్ అధికారి ప్రేమ్ భరత్‌కుమార్, వాలంటీర్లు, బ్రహ్మకుమారీస్, యువత పాల్గొన్నారు.

చైతన్య దీపికలు గురజాడ రచనలు

విజయనగరం టౌన్: మహాకవి రచించిన కన్యాశుల్కం, పుత్తడి బొమ్మ పూర్ణమ్మ, కన్యక వంటి రచనలు చైతన్య దీపకలని సుంకరవీధి ఎస్సీ బాలికల వసతిగృహం-3 సంక్షేమాధికారిణి డి.రాధామణి విద్యార్థినులకు వివరించారు. మహాకవి గురజాడ జయంతిని పురస్కరించుకుని గురజాడ విశిష్టతను చాటిచెప్పారు. గురజాడ చిత్రపటానికి పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. దేశమును ప్రేమించుమన్నా...మంచి అన్నది పెంచుమన్నా.. అంటూ మహాకవి రాసిన దేశభక్తి గేయాన్ని విద్యార్థులతో పాడించి, అర్థం వివరించారు. కార్యక్రమంలో హాస్టల్ విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంటి పన్ను బకాయి అక్షరాలా రూ. 24 లక్షలు



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న సభ్యులు, ప్రజాప్రతినిధులు

- ఇది కథ కాదు.. నిజం
- మండల సమావేశంలో ఎమ్మెల్యేను నిలదీసిన సర్పంచ్
- కంగుతిన్న కూటమి ఎమ్మెల్యే మాధవి

భోగాపురం: బాధ్యత గల ప్రజాప్రతినిధి అయి ఉంటూ మీరు కట్టాల్సిన ఇంటి పన్నే రూ.24లక్షలు కట్టకుంటే ఏ నిధులతో మా పంచాయతీలో అభివృద్ధి పనులు చేయాలంటూ ముంజేరు సర్పంచ్ పూడి నూకరాజు ఎమ్మెల్యే లోకం మాధవిని ప్రశ్నించారు. ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే పలు సమస్యలపై ప్రస్తావించారు. ఈ సమయంలో ముంజేరు సర్పంచ్ నూకరాజు అడ్డు తగులుతూ తమ పంచాయతీలో కాలువ సమస్య ఏళ్ల తరబడి ఉందని, ఇదే రహదారిపై మీరు కూడా నిత్యం ప్రయాణిస్తున్నారని, రహదారిపై మురుగు ప్రవహిస్తున్నా పట్టించుకోవడం లేదంటూ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఎమ్మెల్యే జోక్యం చేసుకుని మీకు చాలా సార్లు చెప్పాను.. ఇప్పుడు కూడా చెబుతున్నాను.. మీరు పంచాయతీ తీర్మానం ఇస్తే తక్షణమే కాలువ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. సర్పంచ్ స్పందిస్తూ పంచాయతీలో నిధులు లేవని, తీర్మానం ఎలా ఇచ్చేదంటూ బదులిచ్చారు. మీరు కట్టాల్సిన ఇంటి పన్ను రూ.24 లక్షలు బకాయి ఉందని, అది చెల్లిస్తే తీర్మానం ఇస్తానని చెప్పారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ మీరు ముందు తీర్మానం ఇవ్వండి నేను ఆ డబ్బులు కట్టి పనులు చేయిస్తానంటూ సమాధానం చెప్పారు. సర్పంచ్ స్పందిస్తూ నిధులు లేకుండా పంచాయతీ తీర్మానం ఇవ్వకూడదని, మీకు తెలియకున్నా చట్టం చెబుతుందని.. మీరు ముందు పన్ను రూపంలో ఉన్న బకాయి రూ.24లక్షలు కడితే సమస్య పూర్తిగా తీరుతుందంటూ బదులిచ్చారు. ఎమ్మెల్యే సమాధానం చెబుతూ మీరు సర్పంచ్‌గా ఉన్నంత వరకు అభివృద్ధి జరగదంటూ అసహనం వ్యక్తం చేశారు. సర్పంచ్ కూడా ధీటుగా సమాధానం చెబుతూ డబ్బులు కట్టకుండా మీరే ఇలా సభను తప్పుదోవ పట్టిస్తే ఇక మేమేమి చేయాలంటూ మాటకు మాట సమాధానం ఇవ్వడంతో పక్కనే ఉన్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు జోక్యం చేసుకుని సర్పంచ్‌ను సముదాయించారు. తరువాత పది నిమిషాల్లో ఎమ్మెల్యే సమావేశం నుంచి వెళ్లిపోయారు. పలు శాఖలకు చెందిన అధికారులు పలు అంశాలపై చర్చించారు. అంతకు ముందు అభివృద్ధికి సంబంధించి రహదారులు వేస్తే బిల్లులు పెట్టకపోవడంపై ఎ.రావివలస సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి ఎమ్మెల్యే ముందు విన్నవించుకున్నారు. యూరియా పూర్తి స్థాయిలో అందడం లేదని సమస్య క్లిష్టంగా ఉందని సర్పంచ్‌లు నూకరాజు, అప్పరభుక్త పైడినాయుడు తదితరులు పేర్కొన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ రావాడ బాబు, పచ్చిపాల నాగలక్ష్మి, తహసీల్దార్ రమణమ్మ, ఎంపీడీవో గాయత్రి, పలువురు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

• శరన్నవ శోభ

- నేటి నుంచి దసరా నవరాత్రులు ప్రారంభం
- రోజుకో అలంకరణలో దుర్గమ్మ దర్శనం



వనంగుడిలో కొలువైన దుర్గాదేవి

విజయనగరం టౌన్: దసరా శరన్నవ రాత్రులు సోమవారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న పైడితల్లి అమ్మవారి ఆలయంలో కొలువుదీరిన దుర్గమ్మ సోమవారం బాలా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆలయ ఆవరణలో శ్రీ చక్ర కుంకుమార్చనలు అక్టోబరు 2వరకూ నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో కె.శిరీష పేర్కొన్నారు. భక్తులందరూ అమ్మవారిని దర్శించి, తరించాలని కోరారు. స్థానిక సిటీ బస్టాండ్ వద్దనున్న కనకమహాలక్ష్మి అమ్మవారు ప్రతీ రోజూ ప్రత్యేక అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారని ఆలయ ప్రధాన అర్చకులు వికె.గాయత్రీ శర్మ పేర్కొన్నారు. భక్తులందరూ అమ్మవారిని దర్శించి, ఆశీస్సులు పొందాలని కోరారు.

గురజాడ స్వగృహాన్ని పరిరక్షించాలి

- ఆయన సాహిత్యం భవిష్యత్ తరాలకు అందించాలి
- రాష్ట్ర ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు



మహాకవి గురజాడ అప్పారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ శంకరరావు

విజయనగరం: ఒట్టి మాటలు కట్టి పెట్టి గట్టి మేల్ తలపెట్టవోయ్ అంటూ దిశా నిర్దేశం చేసిన మహాకవి గురజాడ అప్పారావు స్వగృహాన్ని పరిరక్షించాలని, ఆయన సాహిత్యం భవిష్యత్ తరాలకు అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్, సాహితీవేత్త డాక్టర్ డీవీజీ శంకరరావు ఆకాంక్షించారు. విజయనగరం పట్టణం కామాక్షినగర్‌లో సాయికృష్ణ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గురజాడ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురజాడ సాహిత్యం జాతినంతటినీ చైతన్య పరచిందన్నారు. విజయనగరం పట్టణంలోని గురజాడ గృహంలో షేక్స్పియర్ గృహం తరహాలో, సంరక్షించి సాహితీ పర్యాటక స్థలంగా రూపుదిద్దాలని ప్రభుత్వాన్ని కోరారు. గురజాడ గృహం ఆయన వాడిన వస్తువులు, చదివిన పుస్తకాలు భద్రపరచటం ద్వారా సాహిత్యాభిమానులు నిత్యం వాటిని సందర్శించేందుకు అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో సాయికృష్ణ వాకర్స్ క్లబ్ సభ్యులు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విజయనగరం గంటస్తంభం: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు జె.కామేష్, ప్రధాన కార్యదర్శి ఎస్.రంగరాజు డిమాండ్ చేశారు. అమర్ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా స్వల్ప జీతాలతో పని చేసి మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఇప్పటికీ సాయం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న పారిశుద్ధ్య కార్మికుల పోస్టులను భర్తీ చేయాలని, సచివాలయాల్లో తగిన సిబ్బందిని నియమించిన ప్రసుత్తం పని చేస్తున్న కార్మికులపై పని భారాన్ని తగ్గించాలని కోరారు. కాంట్రాక్ట్, పర్మినెంట్ కార్మికులకు పండగ సెలవులు అమలు చేసి, పనిముట్లు సకాలంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. బుగత అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా మున్సిపల్ కార్మికుల సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదన్నారు. సమావేశంలో తుపాకుల శ్రీను, దల్లె శ్రీను, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

దాడులు ఆపాలి

విజయనగరం గంటస్తంభం: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను వెంటనే నిలిపివేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్, ప్రధాన కార్యదర్శి టివి.రమణ డిమాండ్ చేశారు. అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ పాలస్తీనా సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తోందని, ఇప్పటి వరకు వేలాది మంది మహిళలు, చిన్నపిల్లలు, మేధావులు ప్రాణాలు కోల్పోయారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం ఇజ్రాయిల్‌కు పరోక్ష సహకారం అందించడం ఖండనీయమని పేర్కొన్నారు. యుద్ధాన్ని ఆపే దిశగా భారత ప్రభుత్వం అమెరికా జోక్యంతో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రపంచ దేశాలు పాలస్తీనాకు అండగా నిలిచి, ఇజ్రాయిల్‌కు సహకారాన్ని నిలిపివేయాలని వారు కోరారు.

పోలేరమ్మ తల్లికి జెడ్పీ చైర్మన్ ప్రత్యేక పూజలు



పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు పోలేరమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధర్మపురిలో గల సిరిసహస్ర రైజింగ్ ప్యాలెస్‌లో వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయురారోగ్యాలు పోలేరమ్మ తల్లి ప్రసాదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సతీమణి పుష్పాంజలి, చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు మజ్జి సిరిసహస్ర తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



భవానీ దీక్షా పూజా పుస్తక ఆవిష్కరణ

పూసపాటిరేగ: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత కలుగుతోందని ఉత్తరాంధ్ర భవానీ సేవా పీఠం అధ్యక్షుడు పులపా మల్లేశ్వరరావు అన్నారు. స్థానిక సంతోషిమాత ఆలయం వద్ద భవానీ దీక్షా పూజా విధానం పుస్తకాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో సనాతన ధర్మం కాపాడాలని సూచించారు. భక్తిభావం పెంపొందినప్పుడు ప్రజలు సన్మార్గంలో మెలుగుతారు అన్నారు. గ్రామాలలో దైవభక్తి ఉండి అనుగ్రహం పొందిన కుటుంబాలలో సౌభాగ్యం, సంతోషం, సంతానం, ఐశ్వర్యం, భోగం, మోక్షం కలుగుతుందని పేర్కొన్నారు. ఆయనతో పాటు పేరాపురం సర్పంచ్ రౌతు శ్రీరామమూర్తి, భవానీ గురువులు కె.ఎర్రయ్య, కొమ్మూరు రామకృష్ణ, కొచ్చర్ల గోవింద, కె.అప్పలరాజు, పోలిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా గర్ల్స్ కన్వీనింగ్ కమిటీ



నూతనంగా ఏర్పడిన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా గర్ల్స్ కన్వీనింగ్ కమిటీ

విజయనగరం గంటస్తంభం: ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కన్వీనింగ్ కమిటీ ఎన్నిక స్థానిక జెడ్పీ మినిస్టీరియల్ భవనంలో ఆదివారం జరిగింది. కన్వీనర్‌గా ఆర్.శిరీష, కో కన్వీనర్లుగా భారతి, రూప, జయశ్రీ, శ్రీలత ఎన్నికయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు కె.విజయగౌరి మాట్లాడుతూ ఆడ పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలు, లింగ వివక్ష, లైంగిక వేధింపులు, ఉపాధి సమస్యలపై తదితర వాటిపై ప్రశ్నించే ధైర్యం పెంపొందించుకోవాలన్నారు. ప్రశ్నించడం ద్వారానే ఆడ పిల్లలు తమ ఆత్మ గౌరవాన్ని కాపాడుకోగలరన్నారు. మౌనంగా ఉంటే నేటి సమాజంలో సమస్యలు పరిష్కారం కావన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ సమీరా మాట్లాడుతూ విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి భవిష్యత్ పోరాట కార్యాచరణ రూపొందించామన్నారు. అనంతరం గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు డి.రాము, కార్యదర్శి వెంకటేష్, జిల్లా నాయకులు, విద్యార్థినులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గురజాడ గేయం పాఠశాలల్లో తప్పనిసరి చేయాలి



గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు, సభ్యులు



విజయనగరం అర్బన్: నివాళులర్పిస్తున్న గురజాడ విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు

విజయనగరం గంటస్తంభం: గురజాడ రాసిన దేశభక్తి గేయాన్ని ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా ఆలపింప చేయాలని, ఆ గేయాన్ని పాఠ్య పుస్తకాల్లో ముద్రించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు అన్నారు. గురజాడ జయంతి వేడుకలు ఎల్బీజీ నగర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం జరిగాయి. ముందుగా గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురజాడ సొంతింటిని సాంస్కృతిక మ్యూజియంగా అభివృద్ధి చేయాలని, గురజాడ ఆడిటోరియానికి కేటాయించిన నిధులను వినియోగించి ఆధునిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గురజాడ స్ఫూర్తితో వ్యక్తిగత లాభాన్ని పక్కనపెట్టి సమాజాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మతములన్నీ మాసిపోవును.. జ్ఞానం ఒక్కటే నిలిచి వెలుగును.. అన్న గురజాడ వాక్యాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో సీపీఎం కమిటీ సభ్యులు పి.రమణమ్మ, నగర కమిటీ సభ్యులు బి.రమణ, ఆర్.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గురజాడ విజ్ఞాన కేంద్రంలో..

విజయనగరం అర్బన్: పట్టణంలోని గురజాడ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం మహాకవి గురజాడ అప్పారావు జయంతి ఘనంగా జరిగింది. తొలిత ఆయన స్వగృహంలోని విగ్రహానికి పూలమాలలను వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సాహితీవేత్త జి.ఎస్.చలం మాట్లాడుతూ గురజాడ తన రచనల ద్వారా అభ్యుదయ భావాలను సమాజానికి చాటి చెప్పి కొత్త దిశ చూపారని కొనియాడారు. గురజాడ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ప్రముఖ రచయిత జయంతి సందర్భంగా వారి రచనల్లోని విశిష్టతను విద్యార్థుల్లో వ్యాప్తి చేసే అభ్యుదయ భావాలను పెంపొందించడం లక్ష్యంగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో సంస్కృత కళాశాల అధ్యాపకురాలు యామిని, ఉపాధ్యాయులు వై. శ్రీనివాసరావు, కేటీఎస్ సుబ్రమహ్మణ్యం, ఎం.రామారావు, వి.భాస్కరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

బైక్ జరభద్రం..!



వర్షంలో వాహనాన్ని నడుపుతున్న దృశ్యం

విజయనగరం: వాతావరణ పరిస్థితుల్లో సంభవిస్తున్న మార్పులతో నిత్యం చినుకులు పలకరిస్తూనే ఉన్నాయి.. నిమిషాల్లో వీధులు జలమయం అవుతున్నాయి. ఆ నీటిని దాటుకుంటూనే ముందుకెళ్లాలి. ఏమాత్రం అజాగ్రత్త వహించినా ద్విచక్ర వాహనం షెడ్డుకు చేరే ప్రమాదం ఉంది. కనీస జాగ్రత్తలు తీసుకోకుంటే జేబులకు చిల్లు పడక తప్పదు. బండిని ఒక కంట కనిపెడుతూ.. అవసరమైతే చిన్నచిన్న మరమ్మతులు ముందస్తుగా చేయించాలి. ఉదాసీనంగా ఉంటే.. పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సిందే. వర్షాకాలంలో వాహనాల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఓ సీనియర్ మెకానిక్ పలు సూచనలు చేస్తున్నారు.

తీగల నిర్వహణ తప్పనిసరి

వర్షానికి ఎక్స్‌లేటర్ కేబుల్స్, క్లచ్, బ్రేక్ కేబుల్స్ బిరుసుగా మారుతాయి. అవసరమైన సమయంలో బ్రేకులు పడక ప్రమాదానికి గురవుతుంటాయి. వైర్ల గ్రేసింగ్ కచ్చితంగా చేయించాలి. సరిగా పనిచేయనట్టు అనిపిస్తే.. మెకానిక్‌ను సంప్రదించాలి. వీటిని చాలా శుభ్రంగా ఉంచాలి.

ఎయిర్ ఫిల్టర్‌పై కన్నేయాలి

వాగులు, వంకలు, కాల్వల్లో ప్రయాణం చేస్తే వాహనంలోకి నీరు వెళ్లి స్టార్ట్ కాదు. నీటిలో నడపడం వల్ల ఇంజిన్ ఆయిల్లోకి, సైలెన్సర్‌లోకి నీరు వెళ్లే ప్రమాదం ఉంది. దీంతో ఇంజిన్ పాడయ్యే ఆస్కారం ఉంటుంది.

చక్రాలు తడబడనీయక

వర్షాకాలంలో నిర్ణీత ప్రమాణం కన్నా.. టైర్లలో ఎక్కువగా గాలి నింపుకొంటే వాహనం జారి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంటుంది. గాలి తక్కువగా కూడా ఉండకుండా చూసుకోవాలి. బ్రేకులు కండీషన్లో ఉన్నాయా? లేదా? చూసుకోవాలి. బ్రేకు షూ అరిగిపోతే వెంటనే మార్పించుకోవాలి.

జాగ్రత్తలు పాటించాలి

వర్షాకాలంలో వాహన చోదకులు జాగ్రత్తలు పాటించాలి. ప్రస్తుతం గంట వ్యవధిలోనే కుండపోతగా కురుస్తున్న వర్షాలతో వాహనాలు మొరాయించే అవకాశం ఉంది. వర్షంలో వాహనం తడవకుండా జాగ్రత్త తీసుకోవటంతో పాటు తప్పనిసరి పరిస్థితుల్లో తడిచే వాహనాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి.

– శ్రీను, బైక్ మెకానిక్, విజయనగరం

బ్యాటరీ బాగుండాలి

బ్యాటరీ టర్మినల్స్ (పాజిటివ్, నెగిటివ్) చిలుము పట్టకుండా చూసుకోవాలి. వాటికి పెట్రోలియం జెల్లి పూయాలి. పెట్రోలియం జెల్లి వాడకపోతే బ్యాటరీ సామర్థ్యం తగ్గిపోవడం, వాహనానికి కరెంటు పంపిణీ సక్రమం జరగదు. దీంతో తరచూ ఆగిపోతుంది.

స్టార్టింగ్ సమస్య

వర్షాకాలంలో వాహనం తరచూ మొరాయిస్తుంది. స్పార్క్ ప్లగ్ కండిషన్లో ఉందా..? లేదా..? చూసుకోవాలి. ఇంజిన్ ట్యూనింగ్ పరీక్షించుకుని సర్వీసింగ్ చేసుకోవాలి. ఈ కాలంలో ఉదయం వాతావరణం చల్లగా ఉంటుంది.. చౌక్ ఆన్ చేస్తే పెట్రోలు ఎక్కువ, గాలి తక్కువపోయి త్వరగా స్టార్ట్ అవుతుంది.

చైనుకు ఆయిల్ అద్దాలి

ప్రధానంగా బండి చైనుకు 90 గ్రేడ్ ఆయిల్ వాడాలి. ఫుట్రస్ట్ జాయింట్స్ వద్ద క్లచ్, బ్రేక్ లివర్స్, సైడ్ స్టాండు, మెయిన్ స్టాండు, బ్రేక్ క్యామ్స్ గ్రీసింగ్ కచ్చితంగా చేయించాలి. గ్రేసింగ్ చేసుకోకపోతే చైన్, క్లచ్, లివర్, బ్రేక్ లివర్స్, స్టాండ్లు బిగుతుగా మారుతాయి.

అక్టోబర్ 5న 'భోజన' కార్మికుల జిల్లా మహాసభలు



మహాసభల కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు, సభ్యులు

విజయనగరం గంటస్తంభం:

జిల్లా మధ్యాహ్న భోజన పథకం నాల్గో మహాసభలు అక్టోబర్ 5న స్థానిక అమర్ భవన్‌లో జరగనున్నాయని విజయవంతం చేయాలని ఆ సంఘం (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు ఎం.మురళీధరరావు పిలుపునిచ్చారు. ఆదివారం దీనికి సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నో కష్టాలు పడుతూ సేవాభావంతో పని చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ఇంకా న్యాయం జరగలేదన్నారు. ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచడం, కనీస వేతన చెల్లింపు, ఉద్యోగ భద్రత కల్పించి గుర్తింపు కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు ఎస్.రంగరాజు, బుగత అశోక్ మాట్లాడుతూ చిన్నారులకు కన్నతల్లిలా సేవలందిస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. మెస్ బిల్లులు సకాలంలో రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో పి.లక్ష్మి, కె.రాజీ, కె.కళావతి, బి.ధనలక్ష్మి, పద్మ, అనురాధ, సుధ తదితరులు పాల్గొన్నారు.

మహాకవి జయంతి ర్యాలీలో పౌరవేదిక నిరసన



ర్యాలీగా వస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారుల ముందు బ్యానర్‌తో పౌరవేదిక ప్రతినిధుల నిరసన

విజయనగరం టౌన్: మహాకవి గురజాడ జయంతిని రాష్ట్ర పండగగా నిర్వహించాలని కోరుతూ ఈ ఏడాది ఆగస్టు 12 నుంచి జిల్లా పౌరవేదిక ఆధ్వర్యంలో ప్రతీ రోజూ కార్యక్రమాలను పౌరవేదిక జిల్లా అధ్యక్ష్యుడు భీశెట్టి బాబ్జీ ఆధ్వర్యంలో నిర్వహిస్తూ వస్తున్నారు. ఆదివారం మహాకవి జయంతి పురస్కరించుకుని గురజాడ స్వగృహం నుంచి సత్య లాడ్జి వద్దనున్న గురజాడ కాంస్య విగ్రహం వరకూ ప్రజాప్రతినిధులు, అధికారులు ముందు పౌరవేదిక బ్యానర్ అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేసింది. గురజాడ ఇంటిని ఆధునీకరించాలని, గురజాడ సాహిత్యాన్ని డిజిటలైజ్ చేయాలని కోరుతూ పౌరవేదిక ప్రతినిధులు నిరసన వ్యక్తం చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు.